
సీసీసీ నస్పూర్ : నస్పూర్‌లో ఓటు వేసిన మంచిర్యాల కలెక్టర్ దంపతులు


కోటపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్


రామకృష్ణాపూర్ : ఓటు వేసేందుకు క్యూలో చెన్నూర్ అభ్యర్థి బాల్క సుమన్-రాణి అలేఖ్య దంపతులు

# ఓటేసిన ప్రముఖులు


ఆసిఫాబాద్ : మాక్‌పోల్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ బోర్కడే హేమంత్, ఎస్పీ సురేశ్‌కుమార్

- ఆయా చోట్ల సద్వినియోగం చేసుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులు
- పోలింగ్ కేంద్రాల పరిశీలన..

సీసీసీ నస్పూర్, నవంబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. కాగా, ఆయా చోట్ల పలువురు ప్రముఖులు, ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నస్పూర్ మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ బదావత్ సంతోష్, పల్లవి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి సందర్శించారు. సీసీసీ నస్పూర్ ఎస్ఐ రవికుమార్, శ్రీరాంపూర్ ఎస్ఐ రాజేశ్ బందోబస్తు నిరంతరం పర్యవేక్షించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ సర్వేయలెన్స్, జీపీఎస్, సర్వేయలెన్స్, కంట్రోల్ రూం, వెబ్‌కాస్టింగ్, సోషల్ మీడియా సెంటర్లు చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు సజ్జన్ ఆర్, డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలోని 743 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ తీరును వెబ్‌కాస్టింగ్, సీసీ టీవీల ద్వారా పర్యవేక్షించడంతో పాటు ఆయా పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.

### క్యాతనపల్లిలో విప్ సుమన్..

రామకృష్ణాపూర్, నవంబర్ 30 : క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 50వ పోలింగ్ బూత్‌లో చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్-రాణి అలేఖ్య దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. యువతీ, యువకులు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లారు.

కోటపల్లి, నవంబర్ 30 : కోటపల్లి మండల కేంద్రంలో ఎన్నికల సరళిని విప్ బాల్క సుమన్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఎన్నికలు జరుగుతున్న తీరును పరిశీలించారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ కుటుంబ సభ్యులతో వచ్చి కోటపల్లి పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిని పరిశీలించిన మాజీ ఎమ్మెల్సీ స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి బీఆర్ఎస్ గెలుపునకు దిశా నిర్దేశనం చేశారు.

### మంచిర్యాలలో..

మంచిర్యాలటౌన్, నవంబర్ 30 : మంచిర్యాలలోని ఆర్‌బీహెచ్‌వీ (హిందీ హైస్కూల్)లోని 175 పోలింగ్ బూత్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు-రాజకుమారి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన కొడుకులు రంజిత్‌కుమార్, విజిత్‌కుమార్, కోడలు ఉదయశ్రీ ఓటు వేశారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు-సురేఖ దంపతులు, కొడుకు ఉదయ్‌చరణ్‌రావు-శైలేఖ్య దంపతులు.., బీజేపీ అ భ్యర్థి వెరబెల్లి రఘునాథ్, తన తల్లి రాజ్యలక్ష్మితో కలిసి కార్మెల్ హైస్కూల్ పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు.

### భీమ్‌జీ గూడలో కోవ లక్ష్మి..,
### లక్ష్మీపూర్‌లో ఆత్రం సక్కు..

ఆసిఫాబాద్, నవంబర్ 30 : ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి..


ఓటు వేసేందుకు వచ్చిన మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్ రావు వేలికి సిరా పూస్తున్న ఎన్నికల సిబ్బంది

తిర్యాణి మండలంలోని భీమ్‌జీ గూడలో ఓటు వేశారు. జన్కాపూర్‌లోని 198 పాలింగ్ కేంద్రంలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ రావు, ఆయన సతిమణి రేవతి ఓటు హక్కును వినియోగించుకునానరు. బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు తన స్వగ్రామం లక్ష్మీపూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### నెన్నెలలో దుర్గం చిన్నయ్య

నెన్నెల, నవంబర్ 30 : బెల్లంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తన స్వగ్రామం నెన్నెల మండలం జండా వెంకటాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన, ఉద్యోగాలు చేసుకుంటున్న ఓటర్లు వచ్చి, ఓటు వేశారు.

### కెరమెరిలో ఎస్పీ పరిశీలన..

కెరమెరి, నవంబర్ 30 : కెరమెరి మండలంలో ఓటింగ్ సరళిని ఎస్పీ కే సురేశ్ కుమార్ పరిశీలించారు. ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉంటూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులకు పలు సూచనలు అందజేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల్లోపు ఓటింగ్ పూర్తి చేయాలని ఆదేశాలున్న ఒకటే పోలీంగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో ఓటర్లతో ఆ ప్రాంతం నిండిపోయింది. ఎట్టకేలకు సమయంలోపు వచ్చిన వారందరికీ టోకెన్లు ఇచ్చి, ఓటు హక్కు వినియోగించేలా చేయడంతో మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

### కాగజ్‌నగర్‌లో కోనప్ప..

కాగజ్‌నగర్, నవంబర్ 30 : సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప-రమాదేవి దంపతులు, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తనయుడు కోనేరు వంశీ-మధులిక దంపతులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా మొదలైందని, ప్రజలు బీఆర్ఎస్‌ను అభిమానిస్తూ కేసీఆర్ నాయకత్వాన్ని బలబరుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


కెరమెరి : ఓటింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్ కుమార్


సిర్పూర్ (టీ) : మండల కేంద్రంలో స్థానికులతో టీ తాగుతున్న సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనప్ప


ఓటు వేస్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి చిన్నయ్య


ఆసిఫాబాద్ : భీమ్‌జీ గూడలో ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి

# సెల్‌ఫోన్‌తో పోలింగ్ బూత్‌లోకి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి..

- అడ్డుకున్న వారిపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి
- ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామన్న మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావు

మంచిర్యాల ఏసీసీ, నవంబర్ 30: పాత మంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి గురువారం సాయంత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేంసాగర్ రావు సెల్‌ఫోన్‌తో వెళ్లడంతో అక్కడ విధుల్లో ఉన్న అధికారులు, బీఆర్ఎస్ ఏజెంట్లతోపాటు ఓటు వేయడానికి వచ్చిన ప్రజలు అడ్డుకున్నారు. ఎన్నికల సిబ్బంది కూడా లోపలికి సెల్‌ఫోన్‌తో రావద్దనే నిబంధన ఉండగా బూత్ లోపల సెల్ ఫోన్ ఎలా తీసుకు వచ్చారు..! దానిని ఎందుకు బయటకు తీశారని నిలదీశారు. దీంతో అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు ఎదురుదాడికి దిగారు. బూతు పురాణం మొదలు పెట్టారు. అసలు పోలింగ్ బూత్ వరకు వాహనం రావద్దు, అయినా లోపలి వరకు తీసుకువచ్చారు. పైపెచ్చు మొబైల్‌తో కేంద్రంలోకి వచ్చి ఫోన్ ఆపరేట్ చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధమంటే బూతులు తిడుతున్నారు..! దీనిని ప్రజలు గమనిస్తున్నారని బీఆర్ఎస్ కార్యకర్తలు బాహాటంగానే నిలదీశారు. అక్కడి నుంచి తిరుగు పయనమైన ప్రేంసాగర్ రావు గేటు బయటకు వచ్చాక తన అనుచరులతో బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడికి యత్నించారు. ఇవన్నీ స్థానికులు వీడియోలు తీస్తుండడంతో పోలీసుల సహకారంతో అక్కడ నుంచి మెల్లగా జారుకున్నారు. ఇప్పుడే ఇలా ప్రవర్తిస్తుంటే ఒక వేల పొరపాటున ఎమ్మెల్యే అయితే నియోజక వర్గ ప్రజల పరిస్థితి ఏంటని ప్రజలు చర్చించుకున్నారు. సంఘటన తీరుపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు.


బీఆర్ఎస్ నాయకులపై దాడికి దిగుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు